‘అవి మా పెంపుడు కుక్కలనుకంటున్నావా కొంపదీసి? అవేం రావు.....మేమిద్దరమే!! సుల్తాన్ బజారుకి వస్తావా?’

‘రాను.....’ అన్నాడు ఆటోవాడు మళ్ళీ మోహం తిప్పేస్తూ.

‘మళ్ళీ ఏమొచ్చింది?’ అన్నాడు కిష్టయ్యకోపంగా.

‘మీటర్ మీద రెండ్రూపాయల్ ఎక్స్ట్రా యిస్తే వస్తాసాబ్....’ రాంబాబు వాచ్‌వంక చూసి ‘కెవ్.....’ మని అరిచాడు

“ఏంది సాబ్..... రెండ్రూపాయల్ కోసం ప్రాణం పోయినట్లు అరుస్తావ్?....’ అన్నాడు ఆటోవాడు ముఖం చిట్లిస్తూ.

‘నీ రెండ్రూపాయల కోసం కాదులేవయ్యా....పద.... త్వరగా పద....’ అంటూ రాంబాబు అటొ ఏక్కి కూర్చున్నాడు. కిష్టయ్య అతని పక్కన సర్చుకుని కూర్చున్నాడు.

‘జల్దీ పోవాలంటే మూడ్రూపాయల్ ఎక్స్ట్రా అవుతాది సాబ్.....’ అన్నాడు ఆటోవాడు ఆటోని స్టార్ట్‌చేసి ముందుకు దూకిస్తూ.

కుక్కలు ఆటోవెనకాల కాస్త దూరంగా పరుగెత్తి ఆగిపోయాయ్.

కాస్తదూరం వెళ్ళిం తర్వాత ఆటోవాడు ఆటో ఆపి ఇంజను పరీక్షించసాగాడు.

‘ఏమయింది...ఆటో చెడిపోయిందా?’ కంగారుగా అడిగాడు రాంబాబు.

‘అంతా బిల్‌కుల్ ఠీకున్నది సాబ్ .... మెల్లగాశబ్దం ఎందుకొస్తుందో ఏమో....’ అన్నాడు ఆటోవాడు బుర్ర గోక్కుంటూ.

‘ఏం శబ్దం?’ ప్రశ్నించాడు రాంబాబు.

‘ఇంజన్లకెల్లి బుస్.....బుస్.... అని శబ్దం వస్తుంది సాబ్....’

రాంబాబు, కిష్టయ్య ముఖముఖాలు చూసుకుని ఫక్కుమని నవ్వారు.

‘అది నీ ఆటో చేస్తున్నశబ్దం కాదయ్యా...మేముచేస్తున్నశబ్దం.....ఆటోవాడికి అర్థంకానట్లు చూశాడు.

‘నీ ఆటో ఎక్కడ ముందు మేము బాగా పరుగెత్తాం ....బాగా ఆయాసం వస్తోంది.... అది మా ఊపిరి శబ్దం....’ అన్నాడు రాంబాబు ఇంకా ఆయాసపడుతూ.

‘అట్లెట్లా పరుగెత్తిను?’ అన్నాడు ఆటోవాడు ఆశ్చర్యంగాచూస్తూ.

‘మరి మాకు టైం అయిపోతుందికదా....ఏడు లోపల మేం సుల్తాన్‌బజారుదగ్గర ఉండాలి.....ఇంక స్టార్ట్‌చెయ్.....మేం త్వరగా వెళ్ళాలి......’

‘హిహిహి....’ అన్నాడు ఆటోవాడు.

‘ఏంటి?.....’ అన్నాడు రాంబాబు చికాకుగా.

‘ఇందాక నాకు తెల్వదుసాబ్. మీరింత జల్దీ ఉన్నారని .....’

‘అయితే ఏమంటావ్?....’

‘ఇప్పుడు తెల్సింది....’

'తెలిస్తే?....'

'మీటర్ మీద నాల్గురూపాయలిస్తేనే ఆటోకదుల్తాది సాబ్.... లేకుంటే దిగి నడ్సుకుని పోండ్రి.....'

రాంబాబు పళ్ళు బిగబట్టి, పిడికిలి బిగించి కళ్ళుచికిలించి 'గుర్.... అన్నాడు.

'గట్లయితే దిగిపోండ్రి ....' అన్నాడు ఆటోవాడు కోపంగా.

రాంబాబు నొసలుమీద అరచేత్తో కొట్టుకుంటూ 'సరే పద!' అన్నాడు.

ఆటో ముందుకు కదలింది.

కాసేపయ్యాక ఆటో సుల్తాన్ బజారులోని ఆంధ్రాబ్యాంక్ ముందు ఆగింది.

రాంబాబు, కిష్టయ్య ఆటో దిగారు. రాంబాబు మీటరు ఛార్జి రెండు రూపాయలకి ఎక్స్ట్రా నాలుగు రూపాయలు కలిపి ఆటోవాడికి ఇచ్చాడు. ఆటో వెళ్ళిపోయింది.

'అప్పుడు సమయం సరిగ్గా ఏడుగంటల అయిదు నిమిషాలైంది.

రాంబాబూ కిష్టయ్యా ఇద్దరూ చుట్టూ కలియజూశారు.

'హు.... అనుకున్నంతా అయ్యింది .... వాళ్ళు వెళ్ళిపోయారు....' అన్నాడు రాంబాబు నిరాశగా.

'అంతే మీ వల్లే అయ్యింది గురూగారూ....' అన్నాడు కిష్టయ్య.

'నేనేం చేశాన్రా .... అప్పటికీ కుక్కలు వెంబడిచడంవల్ల అన్నాడు మెడలో తగిలించుకున్న పెంటాక్స్ కెమారాని స్ర్దుకుంటూ.

'నేనంటున్నది మనం స్పీడుగా పరిగెత్తడం గురించి కాదు గురూగారూ....మీరు తెల్లారి కాస్త ముందుగా లేచివుంటే మనమిలా నిరాశపడాల్సిన అవసరం వచ్చుండేది కాదుకదా....' అన్నాడు కిష్టయ్య రౌండుగా తిరుగుతూ ఎక్కడయినా బస్సు కనిపిస్తుందేమోనని.

'ఎక్కడ లేస్తానురా.... రాత్రంతా కలతనిద్ర...తియ్యని కలలు.... ఒకటే కలలు.....' అన్నాడు రాంబాబు పరవశంగా కళ్ళు మూసుకుంటూ.

'కొంపదీసిమనల్నిఫోటోలు తియ్యమని అడిగిందే..... ఆ అమ్మాయి .... ఆ అమ్మాయి పేరేంటండి గురూగారూ?....'

'సరోజ!!....'

'ఆ.... ఆ సరోజని ప్రేమించారా ఏంటి గురూగారూ.



'ఛఛ.... నాకొచ్చింది అటువంటి కలలు కావురా కిష్టయ్యా.... అవి బంగారుకలలు!!' ఏంటండి అవి?'

'మనం గండిపేట వెళ్ళిమట వెళ్ళినట్టూ..... అక్కడ సరోజనీ వాళ్ళస్నేహితుల్ని ఫోటోలు తీసినట్టూ అవి అద్భుతంగా నచ్చినట్టూ వాళ్ళకి ఆ ఫోటోలు బాగా

నచ్చి వాళ్ళకాలేజిలో అందరికి చూపించినట్టూ అప్పటినుండీ ఆ కాలేజి వాళ్ళు ఎక్కడకి పిక్నిక్‌కి వెళ్ళినా, ఆ కాలేజిలో ఏ ఫంక్షనయినా ఫోటోలు తియ్యడానికి మనల్నే పిలిచినట్టూ, మన ఖ్యాతి హైదరాబాద్‌లోని అన్ని కాలేజీలకీ వ్యాపించినట్టూ....'

రాంబాబు ఆకాశాంలోకి చూస్తూ క్రితం రోజు కలల్ని అక్కడ దృశ్యాలుగా చూస్తూ పరవశంగా చెప్పుకుపోతున్నాడు. కిష్టయ్య కూడా ఆకాశం వేపు చూస్తూ రాంబాబు చెప్పే విషయాల్ని పిక్చ రైజ్ చేసుకుని చూస్తున్నాడు.

'...... అన్నట్టు హైదరాబాద్ లో ఎన్ని కాలేజీలు ఉంటాయ్‌రా కిష్టయ్యా?....' అన్నాడు రాంబాబు ఆకాశంలోకి చూస్తూనే....

'ఆడవి విడిగా, మగవి విడిగా, ఆడమగవి కలిపి అంటే కోఎడ్యుకేషనంటారే.... అవి ప్రభుత్వంవి, ప్రైవేటువి, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు అన్ని కలిపి దాదాపు వంద ఉంటాయేమోనండి' చెప్పాడు కిష్టయ్య తనుకూడా ఆకాశంలోకి చూస్తూ.

'అవునా? .... అలా ఆ వంద కాలేజీలకీ మనఖ్యాతి వ్యాపించినట్టు..... వాళ్ళుకూడా ఫోటోలు తియ్యడానికి మనల్నే పిలిచినట్టూ....'

'హబ్బ....హబ్బ....' అన్నాడు కిష్టయ్య ఆనందంగా.

'ప్రతి కాలేజీకి కనీసం ఒక పిక్నిక్ ఉంటుంది. యూనివర్సిటీ ఫంక్షన్ ఎలాగూ ఉంటుంది.... అంటే వంద కాలేజీలకి రెండొందల ఫంక్షన్లు, ఫంక్షనుకి యాభై ఫోటో గ్రాఫ్స్ లెక్క వేస్తున్నా మొత్తం వేల ఫోటోలు.... కాపీకి మూడ్రూపాయలు వేస్కుంటే ముప్పైవేలరూపాయలు.... కేవలం కాలేజీ ఫంక్షన్స్‌వి....'

'హబ్బ.....హబ్బ.....' అన్నాడు కిష్టయ్య సంబరంగా ఆకాశంలో ముప్పైవేల రూపాయల్ని చూస్తూ.

'ఇవేకాక స్టూడెంట్ ఐడెంటిఫికేషన్ కార్డులు, బస్సుపాసులకి పాస్‌పోర్టు సైజుఫోటోలు!! కాలేజీకి యావరేజ్‌గా అయిదొందలమందిస్టూడెంట్స్ అనుకుంటే వంద కాలేజీలకీ వంద ఇంటూ అయిదొందలు .... అంటే యాభైవేలమంది స్టూడెంట్స్. వాళ్ళ పాస్‌పోర్టు ఫోటోలకి స్టూడెంట్‌కి రెండు రూపాయల చొప్పున యాభై వేలమంది స్టూడెంట్స్‌కి లక్షరూపాయలు!!....గుండలమీద చెయ్యేసుకుంటూ పరవశంగా అన్నాడు రాంబాబు .

మీరు కాలేజీ స్టూడెంట్స్ గురించే చెప్పారు. మరి స్కూలు పిల్లలకి కూడా బస్సుపాసులకి ఫోటోలు కావాలికదండీ....'

'అయితే అవి మరో రెండు లక్షలు వేస్కుందాం....'

'హబ్బా హబ్బా....'

ఇద్దరు అలా కలల దృశ్యాల్ని ఊహించుకుంటూ ఆకాశలోకి పరవశంగా చూస్తూ నిలబడిపోయారు.

చుట్టూ కాస్త కలకలంగా ఉండేటప్పటికి ఈ లోకంలో పడ్డారు ఇద్దరూ.

‘ఏంటండీ గురూగారూ మన చుట్టూ ఈ జనం.....?!’ కిష్టయ్య ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు.

రాంబాబు వాళ్ళవంక తేరిపారచూశాడు. అందరూ కళ్ళపైన చెయ్యి ఆనించి ఆకాశంలోకి చూస్తూ అన్నాడు.

రాంబాబూ కిష్టయ్యా కూడా పైకి చూశారు. కానీ వాళ్ళకి అక్కడేమీ కనిపించలేదు.

‘ఏముందీ అక్కడ?...’ అని అడిగాడు రాంబాబు వాళ్ళని.

‘ఏమో మాకేం తెల్సూ?.....’ అని ‘ ఇందాకట్నుండీ మీ ఇద్దరూ పైకి చూస్తుంటే ఏముందా అని మేమూ చూస్తున్నాం....ఇప్పుడు మమ్మల్నే ఏముందీ అక్కడ అని అడిగితే మేమేం చెప్తాం....’ అన్నారు వాళ్ళు వీళ్ళవంక వింతగా చూస్తూ.

‘పదండ్రా పోదాం....’ అంటూ వీళ్ళని వెర్రివాళ్ళని చూసినట్లు చూస్తూ జనం వెళ్ళిపోయారు.

మళ్ళీ రోడ్డుమీద వెళ్ళిద్దరే మిగిలారు.

కిష్టయ్య గాఢంగా నిట్టూర్చాడు. ‘ప్చ్.... చివరది బస్సు కాస్తా వెళ్ళిపోయింది.... మీ కలలన్నీ భగ్నమై పోయాయ్.... మీరు త్వరగా నిద్రలేచి ఉంటే ఎంత బావుండేదండీ గురూగారూ.....’

‘ఆ కలలవల్ల కలత నిద్ర...రాత్రంతా ఆ కలత నిద్రవల్ల తెల్లారి మెలుకువ రాలేదురా కిష్టయ్యా.... కనీసం నువ్వయినా నన్ను నిద్ర లేపాల్సింది....’

‘నాక్కూడా రాత్రంతా మాంచిమాంచి కలలు వచ్చాయండి .... అందువల్ల నాకూ తెల్లారి మెలుకువ రాలేదు....’ అన్నాడు కిష్టయ్యఉత్సాహంగా....

‘నీకా .... ఏం కల?’

‘మరేమోనండి గురూగారూ మన ఎదురుగుండా మిరపకాయ బజ్జీల వాడుతున్నాడు కదండీ.... వాడితో మా ఫోటో స్టూడియో ఇచ్చేస్తా నీ బజ్జీల బండి ఇస్తావా?’ అని మనం అడిగేమంటా....వాడేమో సంతోషంతో ఎగిరి గంతేసి ఒప్పుకున్నాడంటా.... అప్పుడేమో మనం వాడి బజ్జీలబండి తీస్కునిఫోటో స్టూడియో ఇచ్చేశామంటా .... మన దగ్గరికి బజ్జీలు తింటానికి వేలకొద్దీ జనం వస్తున్నారంటా....వాడి దగ్గరికి ఫోటోలు తీయించుకోడానికి ఒక్కళ్ళు కూడా రావడంలేదంటా .... అప్పుడు వాడు ఏడుపుముఖం వేసుకుని ....సంతోషంగా చెప్పుకుపోతున్నాడు కిష్టయ్య.

‘చాల్లేనోర్ముయ్.... దరిద్రం కలా నువ్వూను.... ’ మధ్యలో బ్రేకేశాడు రాంబాబు.

కిష్టయ్య నోరు మూసేసాడు.

‘ఏం చేద్దామంటావ్‌రా’ అన్నాడు రాంబాబు క్షణం తర్వాత.

‘ఇంకేం చేస్తాం పదండి ఇంటికి పోదాం....’

‘ఏయ్ మిస్టర్ ...మిమ్మల్నే’

తీయని కంఠం వేనుకనుండి వినిపించింది.

ఇద్దరూ వెనక్కి తిరిగారు.

సరోజ!!....

ఇద్దరికీ ప్రాణం లేచివచ్చినట్టయింది.

ఒక్క పరుగున సరోజ దగ్గరకి వెళ్ళారు.

'అర్రె మీరుకూడా ఆలస్యంగా వచ్చారా ?' అన్నాడు రాంబాబు .

'నేను ఆలస్యంగా రావడమేమిటి?' అంది సరోజ విలాసంగా హ్యాండ్‌బ్యాగ్ ఊపుతూ.

'బస్సు వెళ్ళిపోయింది కదండీ....' అన్నారు ఇద్దరూ కోరస్‌గా.

'నాన్సెన్స్..... నేను లేకుండా బస్సు వెళ్ళడం ఏమిటి? .... నేను మీకు ఏడుగంటలని ఎందుకు చెప్పానంటే కనీసం ఏడున్నరకైనా వస్తారని .... అందరికీ ఏడనే చెప్పాను. మనం బయలుదేరేసరికి బహుశా ఎనిమిది కావచ్చు.'

రాంబాబూ, కిష్టయ్యా సంతోషంతో ఒక్కసారిగా 'హుర్రే....' అని అరిచారు.

సరోజ ఉలిక్కి పడింది.

'ఏంటా అరుపులూ??!'

'ఏంలేదు మేడమ్..... మా కలలు భగ్నమవలేదు' అన్నాడు కిష్టయ్య.

'కలలా?' అర్థం కానట్టు చూసింది సరోజ.

'ఏం లేదులెండి.....ఏంలేదు' సిగ్గుతో మిలికలు తిరిగాడు రాంబాబు.

కిష్టయ్య బ్యాంక్‌మెట్లమీద కూర్చున్నారు సరోజ, సరోజ పక్కన రాంబాబూ, అతని ప్రక్కన కిష్టయ్యా.

'అవునుగానీ మొన్న అడగడం మర్చిపోయాను.... మీ స్టూడియో పేరు 'ఇస్మైల్ ప్లీజ్' అని ఉందేమిటి?..... అది చూసి మీరు ముస్లిం అనుకున్నా.....' అంది సరోజ.

'అదాండి ..... అసలు స్టూడియోకి నేను పెట్టిన పేరేమో 'స్మైల్ ప్లీజ్' అండీ' కానీ సైన్ బోర్డ్ రాసిన ఆర్టిస్టేమో ఇస్మైల్ ప్లీజ్ అని రాశాడు. ఆ ఆర్టిస్టు పుట్టినప్పటి నుండి ఇక్కడే హైదరాబాద్ లోనే పేరిగాడటండీ..... అందుకనే అలా రాశాడు..... ఇక్కడి వాళ్ళకి ఇదే కరెక్ట్ అనిపిస్తుందికదండీ...అంటే స్మైల్ అయితే ఇస్మైల్ అపర్ణ నీ,స్టూడియో అయితే ఇస్టూడియో అని, స్కూలు అయితే ఇస్కూలు అని అందుకే ఆ బోర్డు కరెక్ట్ చేయించకుండా అలానే ఉంచేశాను....' అన్నాడు రాంబాబు.

రాంబాబు చెప్పిన మాటలకి సరోజకి తెరలుతెరలుగా నవ్వొచ్చింది పడీ పడీ నవ్వింది.

అలా నవ్వడంతో ఆమె పైట జారింది.

రాంబాబు చటుక్కున తల వొంచుకున్నాడు.

సరోజ వెంటనేపైటసర్దుకుని 'పాపం చాలాబుద్ధిమంతుడు' అనుకుంది.

సరోజ స్నేహితులు మెల్లమెల్లగా ఒక్కొక్కరే రావడం మొదలు బెట్టారు.

పావుతక్కువ ఎనిమిదికి బస్సు వచ్చింది.
అందరూ బస్సు ఎక్కి సీట్లలో సర్దుకుని కూర్చునే సరికి ఎనిమిది గంటలైంది.
'పిక్నిక్ పార్టీ అంటే ఆడా మగా కలసి ఉంటారనుకున్నాను. వీళ్ళుచూస్తే మొత్తం అమ్మాయిలే. ఇంతమంది అమ్మాయిలతో మనం వేగ గలమంటావా?.....' అన్నాడు రాంబాబు కిష్టయ్యతో భయం భయంగా.
మరేం ఫరవాలేదులే గురూగారూ....వీళ్ళు మనల్ని కేవలం ఫోటోలు తియ్యడానికే పిలిచారు....' అన్నాడు కిష్టయ్య కొంటెగా.
'ఇంతకీ మీరు బస్సెక్కుతారా లేదా?'
బస్సుడోరు దగ్గర నుంచుని  అంది సరోజ.
ఇద్దరూ సరోజవంక చూశారు.
'అదేంటండి రాంబాబుగారూ....మీ మొహంనిండా చెమటలు ..... అలా వణుకుతున్నారేం?....జ్వరమా?' అంది సరోజ కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.
'అబ్బే ....జ్వరం కాదండీ.... ఇంతమంది అమ్మాయిలని చూసేసరికి గురూగారికి ....హబ్బా.....' అన్నాడు కిష్టయ్య డొక్క తడుముకుంటూ.
సరోజ ముసిముసిగా నవ్వింది.
'నువ్వు కూర్చో ....' అంది తన పక్కన చోటు చూపిస్తూ కిష్టయ్యతో, కిష్టయ్య సరోజ ప్రక్కన కూర్చున్నాడు.
అక్కడ నన్ను కూర్చోమనకూడదూ అని మనసులో అనుకుంటూ రాంబాబు కిష్టాయ్య పక్కన కూర్చున్నాడు.
బస్సు బయలుదేరింది. దాంతోబాటు బస్సులోని అమ్మాయిల అల్లరి కూడా మొదలయింది. ఒకమ్మాయి వాటర్‌గన్ తెచ్చింది. దాంతో కిటికీలోంచి వచ్చేపోయే వారిమీద నీళ్ళు జల్లుతుంది ఆ అమ్మాయి. ఇంకో అమ్మాయి సైకిలిస్టులను పిలిచి మరీ కన్నుకొడుతూంది. వాళ్ళు బ్యాలెన్స్ ఔటయ్యి రోడ్డుమీద బొక్కబోర్లా పడిపోతున్నారు.
'బాబోయ్..... రోడ్‌మీద ముడుచుకుపోతూ మాటిమాటికీ పైట సర్దుకుంటూ తల వొంచుకుని తమదారిన తాము పోయే ఈ అమ్మాయిలు ఇంత అల్లరికూడా చెయ్యగలరా?' అనుకున్నాడు రాంబాబు.